# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 07-03-2017**

గజ్వేల్ నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని, అవి సక్రమంగా అమలై ప్రజలకు ఉపయోగపడేలా చేసే బాధ్యత స్వీకరించాలని కోరారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపై జనహితలో సోమవారం ముఖ్యమంత్రి విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి టి. హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ వెంకట్రామి రెడ్డి, జాయింట్ కలెక్టర్ హన్మంతరావు, సిఎంఓ అధికారులు శాంతకుమారి, భూపాల్ రెడ్డి, స్మితా సభర్వాల్, నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపిపీలు, సర్పంచ్ లు, జడ్పిటీసిలు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రహదారులు, మరుగుదొడ్ల నిర్మాణం, రహదారుల నిర్మాణం, ప్రజారోగ్యం, విద్యా సంస్థల నిర్మాణం, స్మశాన వాటికల నిర్మాణం, వెజ్ – నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం, వ్యవసాయ సంబంధ అంశాలపై సమీక్ష జరిగింది. గ్రామస్థాయిలో తలెత్తే సమస్యలను సిఎం ఓపిగ్గా విన్నారు. అప్పటికప్పుడే పరిష్కారం చేశారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారం బాధ్యతలను శాఖల వారీగా అధికారులకు అప్పగించారు.

“మిషన్ భగీరథ ద్వారా గజ్వేల్ నియోజకవర్గానికి మంచినీళ్లు వస్తున్నాయి. ప్రతీ గ్రామానికి నీళ్లు అందుతున్నాయి. ఊరికి దూరంగా వున్న ఇండ్లకూ, ఎత్తు ప్రాంతాల్లో ఉన్న ఇండ్లకూ నీరందించాలి. ప్రతీ ఇంటికి ప్రతీ రోజు నీరు రావాలి. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలి. అన్ని గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయడం కోసం సబ్ స్టేషన్లు నిర్మించాం. ట్రాన్స్ ఫార్మర్లు ఇస్తున్నాం. ఇంకా విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలి.

నియోజకవర్గంలో పవర్ డే నిర్వహించాలి. వంగిన పోళ్లను సరిచేసుకోవాలి. వేలాడే వైర్లను సరిచేయాలి. నియోజకవర్గంలో ప్రతీ ఇంటిలో మరుగు దొడ్డి నిర్మించారు. కాని అందరూ వాడడం లేదు. వాటిని సంపూర్ణంగా

వినియోగించాలి. వరంగల్ రూరల్ జిల్లా గంగదేవిపల్లి గ్రామంలో ప్రజలు 25 కమిటీలు వేసుకుని వారి గ్రామాన్ని వారే అభివృద్ధి చేసుకుంటున్నారు. ఆ గ్రామంలో పర్యటించండి. చూసి నేర్చుకోండి. ప్రతీ గ్రామంలో స్మశాన వాటిక నిర్మించాలి. ప్రభుత్వం మంజూరు చేసిన రహదారుల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలి. అవసరమైన చోట కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలి" అని సిఎం చెప్పారు.

"నియోజకవర్గంలో లో లెవెల్ కాజ్ వేలను గుర్తించి, వాటిని బ్రిడ్జిలుగా మార్చాలి. అవసరమైన రహదారులు నిర్మించాలి. రోడ్లపై గుంతలు లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయాలి. ప్రతీ గ్రామంలో బస్ షెల్టర్ నిర్మించాలి. ప్రతీ గ్రామంలో స్మశాన వాటిక (వైకుంఠ ధామం). ప్రభుత్వ స్థలం లేని చోట ప్రైవేటు స్థలాలను కొనుగోలు చేయాలి. చెత్త వేయడానికి, సేకరించడానికి అవసరమైన రిక్షాలు, ట్రాక్టర్లు కొనిస్తాం. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి. సర్పంచ్ లు, ఎంపీటీసీలు గ్రామంలోనే వుండి గ్రామాభివృద్ధి పనులను నిర్వహించాలి. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలి. ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రణాళిక రూపొందించుకోవాలి. "మన ఊరు - మన ప్రణాళిక" రుపొందిచుకోవాలి. ప్రతీ గ్రామంలో చెత్త వేయడానికి డంప్ యార్డులు ఏర్పాటు చేయాలి. తెలంగాణకు హరిత హారం కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నాటిన మొక్కలను రక్షించాలి. గ్రామాల్లో ఉపయోగించని బోరు బావులను పుడ్చేయాలి. పాడుపడిన బావులను పూడ్చేయాలి. గ్రామాల్లో సర్కారు తుమ్మలు, జిల్లేడు చెట్లు పూర్తిగా తొలిగించాలి. కూలిపోయిన ఇండ్ల శిథిలాలు తొలిగించాలి. ప్రతీ గ్రామంలో ఎల్ఇడి లైట్లు పెట్టాలి. 750 జనాభా దాటిన ఆవాస ప్రాంతాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు చేస్తాం. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి" అని సీఎం చెప్పారు.

**సిపిఆర్ఓ టు సిఎం**